
# బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శనివారం 26 అక్టోబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 5


## ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు !




**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా పై హైకోర్టులో మరో కేసు దాఖలైంది. హైడ్రాకు ప్రత్యేక అధికారాలు కల్పిస్తూ రేవంత్ సర్కార్ తీసుకున్న నిర్ణయం చట్ట విరుద్ధమని మాజీ కార్పొరేటర్, మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి పిల్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై విచారణ చేపట్టిన తెలంగాణ హైకోర్టు తాజాగా ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. హైడ్రా ఏర్పాటు చేస్తూ ఇచ్చిన ఆర్డినెన్స్, హైడ్రాకు విస్తృత అధికారాలు ఇవ్వడం చట్టవిరుద్ధం అని పిటిషనర్ వాదించారు. హైడ్రా ఆర్డినెన్స్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ నేపథ్యంలో 3 వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను హైకోర్టు 3 వారాలకు వాయిదా వేసింది.

# దక్షిణాది రాష్ట్రాలపై
# కేంద్ర ప్రభుత్వం వివక్ష




- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- 'ది సదరన్ రైజింగ్' సదస్సులో పాల్గొన్న సీఎం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

పన్నుల వాటాల్లో దక్షిణాది రాష్ట్రాలకు హక్కుగా రావలసిన నిధుల విషయంలో ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం వివక్ష ప్రదర్శిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. దేశం ప్రగతిబాటలో పయనించడానికి అన్ని రాష్ట్రాలు సమంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు.

ఏబీపీ నెట్‌వర్క్ మీడియా సంస్థ హైదరాబాద్ లో నిర్వహించిన 'ది సదరన్ రైజింగ్' సదస్సు లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశ ప్రగతిలో దక్షిణాది రాష్ట్రాల పాత్ర, రైజింగ్ తెలంగాణ , రైజింగ్ హైదరాబాద్ లక్ష్యాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు.


రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికల్లో భాగంగా మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్, ఫ్యూచర్ సిటీ ఆలోచనలను వివరించారు.సబర్మతి రివర్ ఫ్రంట్‌కు మద్దతునిస్తున్న వారు మూసీ పురుజ్జీవాన్ని వ్యతిరేకిస్తున్నారని ఆక్షేపించారు.మూసీ, ఈసా నదుల కలయిక ప్రాంతమైన బాపూఘాట్ వద్ద ప్రపంచంలోనే అత్యుత్తమంగా గాంధీ స్మారకాన్ని నిర్మించతలపెట్టామన్నారు.

తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ గారి నుంచి కాంగ్రెస్ ప్రధానులు దేశంలో తీసుకొచ్చిన అనేక సంస్కరణల ఫలితాలను వివరించారు. ప్రధానంగా బహుళార్థ సాధక ప్రాజెక్టులు, విద్య, హరిత విప్లవం, బ్యాంకుల జాతీయీకరణ, 73-74 వ రాజ్యాంగ సవరణలు, శాస్త్ర సాంకేతిక రంగంలో తీసుకొచ్చిన విప్లవం, 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పన, తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణలు దేశ ప్రగతికి ఏ విధంగా తోడ్పడిందీ విడమరిచారు.ఎంతో మంది యువకుల త్యాగాలతో తెలంగాణ ఏర్పడిందని గుర్తుచేస్తూ రాష్ట్ర ప్రగతి విషయంలో కొందరు అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. యువకుల బలిదానాలతో ఏర్పడిన తెలంగాణను... రైజింగ్ తెలంగాణగా, రైజింగ్ హైదరాబాద్‌గా తీర్చిద్దడంలో అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రధాని మోడీ దేశ ప్రజలకు చేసిన మేలు ఏమీ లేదని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి విమర్శించారు. పార్టీలను చీల్చడం, భావోద్వేగాలతో రాజకీయాలు చేయడం తప్ప ఆయన హయాంలో దేశంలో జరిగిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. భారతదేశంలో ఉత్తర, దక్షిణ భారతదేశాలు అనే విభజన తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ హయాంలో అనేక ప్రాజెక్టులు నిర్మాణమయ్యాయని వివరించారు. దేశంలో కాంగ్రెస్, యూపీఏ హయాంలో అనేక విప్లవాత్మక మార్పులు వచ్చాయని తెలిపారు. గతంలో ఉత్తర భారతదేశం నుంచి ప్రధాని అయితే, దక్షిణ భారతం నుంచి రాష్ట్రపతిని చేసే సంప్రదాయాన్ని కాంగ్రెస్ పాటించిందనీ, ప్రధాని మోడీ ఈ సంప్రదాయాన్ని తుంగలో తొక్కారని విమర్శించారు. ఎన్డీయే ప్రభుత్వ హయాంలో దక్షిణాది నుంచి పెద్ద ఎత్తున పన్నులు తీసుకుంటున్నారనీ, కానీ తిరిగి ఇస్తున్నది చాలా స్వల్పమని చెప్పారు. కేంద్రానికి దక్షిణాది రాష్ట్రాల నుంచి ఒక రూపాయి పంపిస్తే, కేవలం 40 పైసలు మాత్రమే తిరిగి వెనక్కి వస్తున్నాయన్నారు. ఉత్తం ప్రదేశ్ నుంచి పన్నుల

మిగితా 3వ పేజీలో

# వీసాల సంఖ్యను భారీగా పెంచిన జర్మనీ



- 20,000 నుంచి 90,000కు..
- వెల్లడించిన ప్రధాని మోడీ

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

నైపుణ్యం కలిగిన భారతీయ కార్మికుల వీసాలను 20,000 నుంచి 90,000కు పెంచుతూ జర్మనీ నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం వెల్లడించారు. న్యూఢిల్లీలో జరిగిన 18వ ఆసియా-పసిఫిక్ కాన్ఫరెన్స్ ఆఫ్ జర్మన్ బిజినెస్ 2024లో ప్రధాని మాట్లాడుతూ.. ఈ విషయాన్ని తెలియజేశారు. ఈ సదస్సులో జర్మనీ ఛాన్సలర్ ఓలాఫ్ షోల్జ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. రాబోయే 25 ఏళ్లలో వికసిత్ భారత్‌కు రోడ్ మ్యాప్ రూపొందించినట్లు చెప్పారు. ఈ ముఖ్యమైన సమయంలో జర్మన్ క్యాబినెట్ 'ఫోకస్ ఆన్ ఇండియా' పేరిట డాక్యుమెంట్‌ను విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. నైపుణ్యం కలిగిన భారతీయ ఉద్యోగుల వీసాల సంఖ్యను 20 వేల నుంచి 90 వేలకు పెంచాలని జర్మనీ నిర్ణయించినట్లు ఈ సందర్భంగా మోదీ ప్రకటించారు. ఈ నిర్ణయం జర్మనీ వృద్ధికి దోహదపడుతుందని ప్రధాని అభిప్రాయపడ్డారు.

# 2028లో అధికారం మాదే



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారక రామారావు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

2028లో మళ్లీ అధికారంలోకి వచ్చేది తామేనని భారతీయ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఏబీపీ సదరన్ రైజ్ సమ్మిట్ 2024 కార్యక్రమానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ అధినేత కేసీఆర్ ఉక్కు నరాలతో తయారైన నాయకుడు అని, ఆయన ఎలాంటి పరిస్థితుల్లోనే చెక్కు చెదరని మనిషి అన్నారు. తమ పదేండ్ల పాలనలో తెలంగాణను నంబర్ 1గా నిలిపామని ఆయన తెలిపారు.దేశ చరిత్రలోనే ఎరగని విధంగా రైతు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని, ప్రభుత్వ ఉద్యోగులకు 73 శాతం జీతాలు పెంచామని ఆయన వెల్లడించారు. బీఆర్ ఎస్ తెలంగాణ ప్రజల పార్టీ అని కేటీఆర్ పునరుద్ఘాటించిన ఆయన తెలంగాణ ప్రజలకు బీఆర్ ఎస్ పార్టీ ఎల్లప్పుడూ కృతజ్ఞతతో ఉంటుందని తెలిపారు. రాజకీయ పార్టీలకు ప్రతి ఎన్నిక ఓ పరీక్ష అని, ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని కేటీఆర్ వెల్లడించారు.

కాంగ్రెస్ పార్టీ 1.8 శాతం ఓట్ల తేడాతోనే గెలిచిందని ఆయన చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అరాచకాల నుంచి ప్రజలను కాపాడుతామని కేటీఆర్ హామీ ఇచ్చారు. తెలంగాణలో పార్టీ ఫిరాయింపులపై కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నోరు మెదపని రాహుల్ గాంధీ తీరును కేటీఆర్ తప్పుబట్టారు. ఇక.. దేశ రాజకీయాల్లో బీజేపీ అనుసరిస్తున్న వ్యూహాన్ని ఆయన విమర్శించారు. తకు సహకరించని పార్టీలపై ఈడీని ప్రయోగిస్తుందని ఆయన బీజేపీని దుయ్యబట్టారు.

# నవంబర్ నెలాఖరులోగా క్రీడా పాలసీ



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

జాతీయ, అంతర్జాతీయ వేదికలపై మన యువత సత్తా చాటేలా తెలంగాణ క్రీడా విధానానికి సంబంధించిన తుది ముసాయిదాను నవంబర్ నెలాఖరులోగా సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. తెలంగాణ క్రీడా విధానంపై ఉన్నతస్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ విధానంలో భాగంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీకి సంబంధించిన బిల్లు సాధ్యమైనంత త్వరగా రూపొందించాలని చెప్పారు.

మరో పది రోజుల్లోగా యంగ్ ఇండియా స్పోర్ట్ వర్సిటీకి సంబంధించిన గవర్నింగ్ బాడీని ఖరారు చేయాలన్నారు.అత్యుత్తమ క్రీడా విధానం కోసం దక్షిణ కొరియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌ల్యాండ్ యూనివర్సిటీ అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని, ఈ రంగంలో నిపుణులు, క్రీడాకారులతో సంప్రదింపులు జరపాలని చెప్పారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు సంబంధించిన క్యాలెండర్‌ను వెంటనే తయారు చేయాలన్నారు.

వచ్చే రెండేళ్లలో నేషనల్ గేమ్స్‌కు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్‌ను సంప్రదించాలని ఆదేశించారు.ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి గారు, ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు గారు, క్రీడా సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి గారు, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి గారు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి గారు, రాష్ట్ర క్రీడల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ గారు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# విద్యుత్ అంటే వ్యాపారం కాదు

- రాష్ట్ర ప్రగతిని పరుగులు పెట్టించే రథచక్రం..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్

వివరాలు 2వ పేజీలో

# బెటాలియన్ కానిస్టేబుళ్లకు ఊరట

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

బెటాలియన్ కానిస్టేబుళ్ల కుటుంబాల ఆందోళన నేపథ్యంలో పోలీస్ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది.. గతంలో ఇచ్చిన సెలవుల రద్దు నిర్ణయాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. దీనిపై కానిస్టేబుళ్ల కుటుంబాలతో చర్చలు జరిపేందుకు సిద్ధమని తెలిపింది. . ఈ మేరకు స్పెషల్ అదనపు డీజీపీ శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. దాంతో బెటాలియన్ పోలీస్ కానిస్టేబుళ్ల కుటుంబాల పోరాటం ఫలించింది. తమ భర్తలను కూలీల కంటే హీనంగా చూస్తున్నారని . తెలంగాణ వ్యాప్తంగా గతకొన్ని రోజులుగా పోలీస్ కానిస్టేబుళ్ల భార్యలు ఆందోళనలు చేస్తున్నారు.. రాష్ట్రంలో ఒకే పోలీసు విధానం అమలు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు బెటాలియన్ కానిస్టేబుళ్లు 15 రోజులకు ఒకసారి సెలవుపై వెళ్లే అవకాశం ఉండేది. కానీ ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిబంధనలను మార్చి కొత్త లీవ్ మాన్యువల్‌ను అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు కొత్త జీవోను విడుదల చేసింది. దీని ప్రకారం ఇప్పటివరకు 15 రోజులకు ఒకసారి ఇంటికి వెళ్లిన కానిస్టేబుళ్లు.. ఇకపై 26 రోజులకు ఒకసారి ఇంటికి వెళ్లాల్సి వస్తుంది. ఈ మ్యాన్యువల్‌పై బెటాలియన్ కానిస్టేబుళ్ల కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలు బెటాలియన్ల ముందు ధర్నా చేయగా.. ఇవాళ సెక్రటేరియట్ ముట్టడికి కూడా యత్నించారు. దీంతో దిగొచ్చిన పోలీస్ శాఖ ఆ జీవోను తాత్కాలికంగా నిలిపివేసింది.

### సచివాలయం ముట్టడికి యత్నం

అంతకుముందు రాష్ట్ర సచివాలయం వద్దకు బెటాలియన్ కానిస్టేబుళ్ల భార్యలు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. అనంతరం తమ భర్తలు ఒకే దగ్గర విధులు నిర్వర్తించేలా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు నిరసన వ్యక్తం చేస్తున్న వారిని అరెస్ట్ చేసి పీఎస్‌కు తరలించారు. ఈ క్రమంలో రాష్ట్ర సచివాలయం ముందు ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణ నెలకొంది.



# సీఎం రేవంత్ రెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నాం



- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- ఇందిరా పార్క్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సీఎం సవాలు స్వీకరించడానికి తాము సిద్ధంగా ఉన్నామని, మూసీ ప్రజల ఇళ్లను కాపాడడం కోసం నదీ పరివాహక ప్రాంతంలో ఉండటానికైనా తాము సిద్ధమేనని కేంద్ర బొగ్గు గనుల శాఖ కిషన్ రెడ్డి అన్నారు.శుక్రవారం ఇందిరా పార్క్‌లోని ధర్నా చౌక్ ప్రాంతంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అధ్యక్షతన బీజేపీ నాయకులు, కార్యకర్తలు బాధితులతో కలిసి ధర్నాకు దిగారు.

ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్ల నుంచి ఇక్కడ పేదలకు ప్రభుత్వాలే ఓటరు కార్డులిచ్చాయని, రోడ్లు, కరెంట్ లాంటి మౌలిక సదుపాయాలు కల్పించాయని, ఇప్పుడు ఉన్నట్లుండి వాళ్ల ఇళ్లు కూల్చేస్తామనడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల ఇళ్లు కూల్చేస్తే చంచల్‌గూడ జైలుకు వెళ్లడానికైనా సిద్ధమేనని చెప్పారు. మూసీ సుందరీకరణ ముఖ్యమా? కాలనీలకు రోడ్లు ముఖ్యమా? గ్రేటర్ మున్సిపాలిటీకి, వాటర్ బోర్డుకు, వీధి లైట్ల కోసం నిధులు లేవు గానీ, రూ. లక్షా 50 వేల కోట్లు అప్పు తెచ్చి మూసీ సుందరీకరణ అవసరమా..? అని ప్రశ్నించారు. మూసీ పరివాహకంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్, మెట్రో స్టేషన్ పరిస్థితి ఏంటి..? మూసీ పక్కన ఏళ్లుగా ఉన్న దేవాలయాలను కూల్చే దమ్ముందా..? పేదలపై ప్రతాపం ఎందుకు చూపిస్తున్నారు? అని అన్నారు.

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ పేదల కోసం ఎంతవరకైనా పోరాడతామని, అవసరమైతే రాష్ట్రాన్ని దిగ్బంధిస్తామని అన్నారు. మూసీ సుందరీకరణకు లక్షన్నర కోట్లు ఎందుకని ప్రశ్నించారు. మోడీ సబర్మతి రివర్ ఫ్రంట్‌ని రూ.7 వేల కోట్లలో కట్టారని, వేల కిలోమీటర్ల పరిధిలో నిర్వహిస్తున్న నమామి గంగే ప్రాజెక్ట్ కు కేవలం రూ.40 వేల కోట్లేనని, కానీ మూసీకి మాత్రం దేశంలోనే అత్యధికంగా నిధులు ఖర్చుచేయడం ఏంటని నిలదీశారు. బీఆర్ఎస్ ఏక్ నిరంజన్ పార్టీ అని అంతా ఒక్కడిగా నడిచిందని, . కాంగ్రెస్ లో అందరూ ముఖ్యమంత్రులే అని, ఎవరికి వారు ఇష్టం వచ్చినట్లు మీడియా ముందు మాట్లాడుతున్నారని అన్నారు.

ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ మూసీ బాధితులకు అండగా, వారి పక్షాన పోరాడటానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నాయకత్వంలో ముందడుగు వేస్తున్నామని అన్నారు. మూడు నెలలుగా రాష్ట్ర వ్యాప్తంగా హైడ్రా కూల్చివేతలు, మూసీ కూల్చివేతలతో పేదలకు కంటి మీద కునుకు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడ చూసినా పేదల కన్నీళ్లతో రాష్ట్రం కకావికలమవుతోందన్నారు.

# విద్యుత్ అంటే వ్యాపారం కాదు

## రాష్ట్ర ప్రగతిని పరుగులు పెట్టించే రథచక్రం..

- పాలకులకు విజన్ ఉంటే.. సంపద పెంచి పేదలకు పంచాలి..
- ప్రజలపై కరెంట్ చార్జీల భారం మోపి.. సంపద పెంచాలనుకోవడం దుర్మార్గం.
- ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి కుంటు పడింది..
- బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల మీద ఒక్క రూపాయి భారం వేయలేదు..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్




**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల,**

"డిస్కంలంటే డిస్ట్రిబ్యూషన్ సంస్థలే అని, ఖజానాకు కంట్రిబ్యూషన్ చేసే కంపెనీలు కాదు అని,విద్యుత్ అంటే వ్యాపారం కాదు,రాష్ట్ర ప్రగతిని పరుగులు పెట్టించే రథచక్రం,విద్యుత్ సంస్థల బలోపేతం కోసం చేసే ఖర్చు భారం కాదు అని,అది ప్రభుత్వ బాధ్యత అని,ప్రభుత్వం అదనపు ఆదాయం కోసం 18 వేల కోట్ల ప్రజలపై అదనపు భారం మోపాలన్న ఆలోచన చేస్తుందని, ఇది ప్రజా వ్యతిరేకమైనది,విద్యుత్ సంస్థలు ప్రతిపాదించిన ఛార్జీలను తిరస్కరించాలి" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు.

శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని పద్మనాయక కళ్యాణ మండపంలో విద్యుత్ ఛార్జీల పెంపునకు సంబంధించి తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ విచారణలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్,సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి, రాష్ట్రం తీవ్రమైన విద్యుత్ కొరతతో ఉన్నది, పారిశ్రామిక వేత్తలు పవర్ హాలిడేస్ వద్దని ఇందిర పార్క్ వద్ద ధర్నాలకు దిగిన పరిస్థితి,మరో వైపు రైతులు కరెంట్ లేక తీవ్ర నిరాశలో ఉన్న పరిస్థితి నెలకొందని అన్నారు. సిరిసిల్లలో క్షూడా పవర్ లూమ్ పరిశ్రమ కరెంట్ తోనే ముడి పడి ఉంది అని,ఇక్కడ కూడా కరెంట్ లేక ఎంతో మంది నేతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారు అని అన్నారు.తెలంగాణ అభివృద్ధికి సంబంధించి ,ప్రతి మనిషికి విద్యుత్ తో విడదీయరాని సంబంధం ఉంది అని అన్నారు.ప్రభుత్వం వివిధ కారణాలు చెప్పి 963 కోట్లు అప్ ఛార్జీలను ప్రజలపై భారం వేయాలనుకోవటం సరికాదు అని,ఈ ఆర్థిక సంవత్సరానికి తక్షణం రూ. 12వందల కోట్లు పెంచుకోవటంతో పాటు, డిస్కంలు చేసిన 9 ప్రతిపాదనలు తిరస్కరించాలని విజ్ఞప్తి చేశారు.గత బీ ఆర్ ఎస్ ప్రభుత్వంలో కేసిఆర్ తీసుకున్న నిర్ణయాలు వల్ల తెలంగాణలో పది సంవత్సరాలపాటు విద్యుత్ సంస్థలకు స్వర్ణ యుగముగా మారిందని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 10 నెలల్లోనే కరెంట్ కోతలు మొదలయ్యాయని,దానికి తోడు ఇప్పుడు కరెంట్ ఛార్జీల వాతలు పెట్టే ప్రయత్నం ప్రభుత్వం చేస్తుందని అన్నారు..

కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు పదేళ్ల పాటు రాష్ట్ర ప్రజల మీద ఒక్క రూపాయి భారం వేయలేదు అని,రైతులకు 24 గంటల ఉచిత కరెంట్, మిషన్ భగీరథ లాంటి ప్రాజెక్ట్ ఉచితంగా నీళ్లు అందజేశామని అన్నారు. మా ప్రభుత్వం లో సిరిసిల్లలో నేతన్నలకు 10 హెచ్ పీ మీద 50 శాతం సబ్సిడీ ఇచ్చామని,ఇప్పుడు 10 హెచ్ పీలను 30 హెచ్ పీ ల వరకు పెంచి 50 శాతం సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఇండ్ల కి 300 యూనిట్లకు దాటితే, ప్రస్తుతం ఉన్న రూ. 10 ఫిక్స్ డ్ ఛార్జీలను రూ 50 కి పెంచాలని ప్రతిపాదించారు అని, దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. సిరిసిల్ల సెస్ పరిధిలోనే లక్షా 20 వేలకు పైగా కనెక్షన్లు ఉన్నాయని, 75 వేల కనెక్షన్ల వరకు ఎండకాలంలో 300 యూనిట్లకు పైగా వాడుతున్నారు అని అన్నారు. కరెంటు వినియోగం అనేది గతంతో పోల్చితే చాలా వరకు పెరిగింది అని,ఇప్పుడు డిస్కంలు చేసిన ప్రతిపాదన ఏదైనా ఉందో, పేద మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచేలా ఉంది అని,ఈ ప్రతిపాదనను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు.11కేవీ, 33కేవీ, 220 కేవీ కింద నడిచే పరిశ్రమలకు సంబంధించి అన్నింటిన ఒకే కేటగిరీ లోకి తేవటమనేది అసంబద్ధం అని,అదానీ ఒక ఫ్యాక్టరీ పెడితే వారికి వర్తించే కేటగిరీనే, సిరిసిల్లలో సాంచాలు నడిపే పరిశ్రమకు ఒకే విధముగా ఉంచాలనుకోవటం సరియైన నిర్ణయం కాదు అని,

పరిశ్రమలకు సంబంధించి కరెంట్ ను అన్నింటిని ఒకే విధముగా ఉంటే సూక్ష్మ,చిన్న మరియు మధ్య పరిశ్రమలకు ఉరివేసినట్లే అవుతుందని, ఈ విధమైన కుట్ర చేస్తూ చిన్న పరిశ్రమలకు రాయితీ ఇవ్వకుండా ఉండే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వ అసంబద్ద నిర్ణయాలతో రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి కుంటు పడింది అని,చాలా పరిశ్రమలు తరలిపోతున్నాయని, ఇంకా ఛార్జీలు పెంచితే పరిశ్రమలకు తీవ్ర నష్టం జరుగుతుంది అని,కుటీర పరిశ్రమలు, చిన్న పరిశ్రలు బేంబేలెత్తేపోతున్నాయని,కుటీర, చిన్న, పెద్ద పరిశ్రమలను కాపాడుకోవాల్సిన అవసరముంది అని అన్నారు.డిస్కంలు చేసిన ప్రతిపాదనలకు వాస్తవ పరిస్థితులకు పొంతన లేదు అని అన్నారు.

రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు గత ప్రభుత్వం 12 వందల కోట్లు భరించిందని, ఈ ప్రభుత్వం ఎందుకు భరించదు అని ప్రశ్నించారు. మా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మోటార్లకు మీటర్లు పెట్టాలని కేంద్రం ఒత్తిడి తెచ్చిన అందుకు అంగీకరించలేదు అని అన్నారు.10 హెచ్ పీ వరకు సిరిసిల్ల నేతన్నలకు సబ్సిడీ ఇచ్చాం అని,నాయి బ్రహ్మణులు, రజకులకు, ఎస్సీ, ఎస్టీ లకు ఉచిత విద్యుత్ ఇచ్చే ప్రయత్నం చేశామని అన్నారు. గత బీ ఆర్ ఎస్ ప్రభుత్వం పదేండ్ల కాలంలో ఛార్జీలు పెంచలేదు అని, మరి ఇప్పుడు పదినెలలకే ఎందుకు ఛార్జీలు పెంచే ప్రయత్నం చేస్తున్నారు అని ప్రశ్నించారు. ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కరెంట్ ఛార్జీల పెంపు కారణంగానే తెలంగాణ ఉద్యమం పుట్టింది, ఆనాడు ఛార్జీలు పెంచితేనే కేసీఆర్ ఉద్యమం మొదలుపెట్టారు అని,మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే అదే పరిస్థితి తేవటం శోచనీయమని అన్నారు.


ఈఆర్సీ ఛైర్మన్ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు,ఈ ప్రాంత బిడ్డగా తెలంగాణ ప్రయోజనాలకు నష్టం చేకూర్చే ప్రతిపాదనలను తిరస్కరించాలని అన్నారు. విద్యుత్ వ్యాపార వస్తువుగా చూడవద్దని,రాష్ట్ర ఆర్థిక ప్రగతికి చోదక శక్తిగా భావించాలని అన్నారు. సిరిసిల్ల లో సెస్ అనేది చాలా ప్రతిష్టాత్మక సంస్థ, దేశంలో సహకారం రంగంలో ఉన్న చాలా తక్కువ విద్యుత్ సంస్థల్లో సెస్ ఒక్కటి అని, మా నేతృత్వంలోని సెస్ పాలక వర్గం బ్రహ్మాండంగా పనిచేస్తోంది అని అన్నారు.డిస్కంలతో పోల్చితే సెస్ పనితీరు 100 శాతం మెరుగు అని,గతంలో సెస్ ను రాష్ట్ర ప్రభుత్వంలోని సంస్థల్లో కలుపాలని ప్రయత్నిస్తే ఇక్కడి ప్రాంత వాసులు వ్యతిరేకించారు అని అన్నారు.

2023-24 ఆర్థిక సంవత్సరానికి సెస్ కొనుగోలు చేసే విద్యుత్ ను 965.26 MUగా నిర్ధారించారు, కానీ వాస్తవానికి 2023-2024 సంవత్సరానికి సెస్ కొనుగోలు చేసిన విద్యుత్ 1133.52 MUలు అని, 168.26 MUలు అదనంగా కొనుగోలు చేసిందని,అదనపు యూనిట్లు ఖర్చు ప్రభుత్వమే భరించి,సెస్ ను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. సబ్సిడీ ఇస్తూ ఎప్పటికప్పుడు ఆ డబ్బు ప్రభుత్వం నుంచి సంస్థకు వచ్చే విధంగా గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేయాలని అన్నారు. నేతన్నల సమస్యలు తెలిసిన వ్యక్తిగ్గా విజ్ఞప్తి చేస్తున్నా,సిరిసిల్లలో నేతన్నల పరిస్థితి ఆగమ్య గోచరంగా ఉంది అని అన్నారు.

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పదేళ్లు బతుకమ్మ చీరలు, స్కూల్ యూనిఫాం వంటి ఆర్డర్ ఇక్కడి నేతన్నలకు ఇచ్చామని,వర్కర్ టూ ఓనర్ పథకం కోసం దాదాపు రూ. 400 కోట్లు ఖర్చు చేసామని, అప్పెరల్, టెక్స్ టైల్ పార్క్ లను బలోపేతం, మరమగ్గాలను మోడ్రనైజేషన్ చేసామని అన్నారు. గత ప్రభుత్వం అధికారం ఉన్నా పదేళ్లలో సిరిసిల్లలో ఆత్మహత్యలు ఆగిపోయాయని,కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే 10 మందికి పైగా నేతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారు అని అన్నారు.సిరిసిల్లను మరో తిరుపూర్ చేయాలని కేసీఆర్ ప్రభుత్వం ప్రయత్నం చేసింది,ఇప్పుడున్న ప్రభుత్వం బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వటం లేదు,వారికి ఆర్డర్లు వచ్చే విధంగా ప్రభుత్వం ఇవ్వాలని అన్నారు.

ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించి ఇక్కడ ఉన్న 10 హెచ్ పీ సబ్సిడీని 30 హెచ్ పీ ల పెంచాలని, ప్రజలపై 18 వేల కోట్ల భారాన్ని మోపాలని చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని,. అదే విధంగా డిస్కంల ప్రతిపాదనలను తిరస్కరించాలని అన్నారు.సెస్ ను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి తరపున సూచనలు చేయాలని అన్నారు.

## ఈడీ రైడ్స్‌లో ఎన్ని నోట్ల కట్టలు దొరికాయనే బాంబు పేలుతుందా...?



- నా మీద ఏమైనా కేసు పెట్టాలనుకుంటే పెట్టుకో..
- వైయస్సార్,చంద్రబాబుల కే భయపడలే.. చిన్న రాయుడు కి భయపడతామా..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్..

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల :**

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీద జరిగిన ఈడీ రైడ్ ల్లో ఎన్ని నోట్ల కట్టలు దొరికాయి,ఎన్ని కట్టల పాములు దొరికినయన్నది చెబుతాడేమో, ఆ బాంబు ఏదైనా చెప్పి పేలుస్తాడేమో అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శుక్రవారం రాజన్న సిరిసిల్లలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దీపావళిలోపు బాంబు పేలుతుంది అంటూ చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. కేటీఆర్ మాట్లాడుతూ బాంబు అంటే. ఎట్ల బీజేపీతో సంధి కుదుర్చుకున్నది, ఎట్ల బీజేపీని బతిమిలాడి ఈ డీ కేసు కాకుండా చూసుకున్నది, ఆదానీ కాళ్ళ పట్టుకున్నది ఆ బాంబు ఏదైనా చెబుతాడా ఏమో అని అన్నారు. అమృత్ పథకంలో భాగంగా ముఖ్యమంత్రి బావమరిదికి రూ. 1,137 కోట్ల కాంట్రాక్ట్ ఇచ్చి స్కాం చేశారని నేను ఆరోపిస్తున్నా, దాని మీద బీజేపోళ్లు స్పందించటం లేదు అని,దాని మీద విచారణకు ఆదేశించే బాంబు ఏమైనా పేల్చుతారా అని ప్రశ్నించారు.అది లక్ష్మి బాంబా,సుతిలి బాంబా,తుస్సు బాంబా అన్ని తేలుతాయి అని అన్నారు.నా మీద ఏమైనా కేసు పెట్టాలనుకుంటే పెట్టుకో,ఏం పీక్కుంటావో పీక్కో, ఇటువంటి కొత్త బిచ్చగాళ్లను చాలా మందిని మేము చూశాం అని అన్నారు.రాజశేఖర్ రెడ్డి, చంద్రబాబు లాంటి వాళ్లతోనే కొట్లాడాం,ఈ చిట్టి నాయుడు మాకు పెద్ద లెక్క కాదు అని, చావుకు తెగించి తెలంగాణలో ఉద్యమంలో కొట్లాడినం, ఈ పిచ్చి డైలాగులకు భయపడేటోడు ఎవడు లేడు అని అన్నారు.వర్జినల్ బాంబులకే భయపడలేదు, వీళ్ల తుస్సు బాంబులకు భయపడేది లేదు అని, ఏదో అడ్డమైన కేసు పెట్టి జైలుకు పంపుతానంటే పంపుకొమ్మని అన్నారు. కానీ ఇప్పుడు ఎవ్వడైతే తెగించి రియల్ ఎస్టేట్ సెటిల్మెంట్లు చేస్తున్నాడో, బిల్డర్లను బెదిరించి ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నాడో ఇంతకు వంద రెట్లు మిత్తితో సహా ఇస్తాం అని అన్నారు.మళ్లీ వచ్చేది మా ప్రభుత్వమే,అప్పుడు వాళ్లను చూసుకునే బాధ్యత కూడా నాదే అని అన్నారు.



## బొగ్గు, గనుల శాఖ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా ఎంపీ వద్దిరాజు

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల,**

బొగ్గు, గనుల శాఖ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులుగా రాజ్యసభ సభ్యులు, మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వద్దిరాజు రవిచంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది.ఈ సంఘం చైర్మన్‌గా బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి వ్యవహరిస్తారు. ఎంపీ రవిచంద్ర పెట్రోలియం సహజ వాయువు శాఖ పార్లమెంటరీ స్థాయి సంఘం సభ్యులుగా కూడా ఉన్నారు.



## వన్య ప్రాణులను రక్షిద్దాం

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలంలోని మండెపల్లి గ్రామంలో ఓ ఇంట్లో నాగుపాము చొరబడగా మండలంలోని టెక్స్‌టైల్ పార్కు చెందిన వడ్డేపల్లి శేఖర్ అనే యువకుడు నాగుపాముని పట్టుకొని తీసుకెళ్లి అడవిలో వదిలాడు. వన్య ప్రాణులను సంరక్షించాలని ఉద్దేశంతో గత కొన్ని సంవత్సరాలుగా ఎక్కడైనా ఎవరింట్లో అయినా పాములు వచ్చినప్పుడు పట్టుకొని తీసుకెళ్లి అడవిలోకి వదులుతానని తన నెంబర్ కు 99082 32966, 9100281016ఫోన్ చేసి సమాచారం అందిస్తే వచ్చి అడవిలోకి తీసుకెళ్లి వదులుతామని తెలిపారు.



## మానవత్వం చాటుకున్న కేటీఆర్

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలంలోని నేరేళ్ల శివారులో ఓమిని వ్యాన్ బైకు ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మాజీ మంత్రి కే టి ఆర్ తన కాన్వాయి ఆపి, గాయపడ్డ వారిని108 కి అంబులెన్స్ కి కాల్ చేసి క్షతగాత్రులను అంబులెన్స్ లో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## పీహెచ్‌సీ భవనాల సివిల్ పనుల మరమ్మతులు చేపట్టాలి



- ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి..
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పీహెచ్‌సీల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పని తీరు, వాటి సమస్యలు, సిబ్బంది కొరత వంటి పలు అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీక్ష సమావేశం నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉన్న 2 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 13 పి.హెచ్.సి లు, వాటి పరిధిలో గల సమస్యలు, అవసరమైన మౌలిక వసతులు, జెనరేటర్ , సివిల్ పనుల మరమ్మతులు, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, ఔట్ పేషెంట్ వివరాలు, మిషన్ ఇంద్ర ధనుష్, గర్భిణీ మహిళల ఏ.ఎన్.సి రిజిస్ట్రేషన్, ఎన్సిడి సర్వే పై కలెక్టర్ సందీప్ కుమార్ పిహెచ్ సి వారిగా సమీక్షిస్తూ అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ పి.హెచ్.సి లలో అవసరమైన మౌలిక వసతులు, వైద్య పరికరాలు, ఫర్నిచర్, పవర్ బ్యాక్ అప్ , యు.పి.ఎస్. ప్రతిపాదనలు తయారు చేసి సమర్పించాలని క్రమ పద్ధతి ప్రకారం మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. మన ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని,పిహెచ్సి లు, సబ్ సెంటర్ల పరిధిలో ఔట్ పేషెంట్ సంఖ్య పెంచాలని , పెద్ద లింగాపూర్ మరియు చందుర్తి పిహెచ్సి భవనాలను త్వరలో ప్రారంభానికి సిద్ధం చేయాలని అన్నారు .జిల్లా కేంద్రంలో ఉన్న డయాగ్నస్టిక్ హబ్ ను వినియోగించుకోవాలని, రోగులకు అవసరమైన వైద్య పరీక్షలు డయాగ్నస్టిక్ హబ్ ద్వారా చేయాలని,డెంగ్యూ ,మలేరియా మొదలగు నిర్ధారణ పరీక్షలను అవసరమైన రోగులకు ఉచితంగా చేయాలనిఅన్నారు .

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గర్భిణీ స్త్రీల గుర్తింపు, ఏఎన్సి రిజిస్ట్రేషన్ 100 శాతం జరగాలని, గర్భిణీ మహిళలు తప్పనిసరిగా టీకాలు తీసుకునేలా చూడాలని, మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం కింద పిల్లలకు పూర్తి స్థాయి టీకాల వ్యాక్సినేషన్ పూర్తి కావాలని అన్నారు. ఆసుపత్రిలో వైద్యులు సకాలంలో విధులకు హాజరు కావాలని అన్నారు. వ్యాక్సిన్ భద్రత అంశంలో నిర్దిష్ట ప్రమాణాలను పాటించాలని కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, వసంతరావు, ప్రోగ్రామ్ అధికారులు, మెడికల్ ఆఫీసర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నేరం చేస్తే శిక్ష తప్పదు, శిక్షల పెంపుతోనే సమాజంలో మార్పు...



- 61 కేసులలో నిందితులుగా ఉన్న వారికి జైలు శిక్షలు,మూడు కేసులలో జీవిత ఖైదు...
- ఎస్పీ అఖిల్ మహాజన్

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల :**

నిందితులకు శిక్షపడుటలో పోలీసులతో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల ది కీలకపాత్ర అని , న్యాయాధికారులు,పోలీస్ అధికారులు సమన్వయం పాటిస్తూ నేరస్థులకు ఖచ్చితంగా శిక్ష పడేవిధంగా బాధ్యతగా కృషి చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు . శుక్రవారం పోలీసు అధికారులు,పబ్లిక్ ప్రాసిక్యూటర్లు,కోర్ట్ కానిస్టేబులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి గడిచిన సంవత్సర కాలంలో 61 కేసుల్లో నేరస్తులకు శిక్షలు,మూడు కేసులలో జీవిత ఖైదు పడే విధంగా కృషి చేసిన పీపీ లను,కోర్టు కానిస్టేబుల్ లను ఎస్పీ అఖిల్ మహాజన్ ఆభినందించి ప్రసంశ పత్రాలు అందజేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ వివిధ ఘటనల్లో నిందితులపై నమోదైన కేసుల్లో ఎఫ్ఐఆర్ నమోదు మొదలు, కేసు విచారణ, కోర్టులో వచ్చే ట్రయల్, క్రైమ్ డీటెయిల్ ఫారం, ఛార్జ్ షీట్ లలో దొర్లే పొరపాట్లను సరిచేస్తూ సదరు పోలీస్ అధికారులకు సూచన చేయడం, పోలీసు అధికారులు సాక్షులను సరైన పద్దతిలో ప్రొడ్యూస్ చేయు పద్ధతి, మొదలైన అనేక అంశాల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు తీసుకుంటూ కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రధాన కేసుల్లో నిందితులకు జీవిత ఖైదుపడేలా కృషి చేయాలని శిక్షల శాతం పెరిగేలా పనిచేసే అధికారులకు,సిబ్బందికి రివార్డులు అందజేయడం జరుగుతుందని తెలిపారు.

గడిచిన సంవత్సర కాలంలో 61 కి పైగా కేసుల్లో నెరస్థులుగా ఉన్న వారికి జైలు శిక్షలు ,మూడు కేసులలో జీవిత ఖైదు కోర్ట్ ద్వారా విదించడం జరిగిందని అన్నారు కేసుల్లో నేరస్తులకు శిక్ష పడేవిధంగా కృషి చేసిన పీపీలు,లక్ష్మీ ప్రసాద్, శ్రీనివాస్, లక్ష్మణ్,సందీప్,సతీష్,విక్రాంత్,మరియు అన్ని పోలీస్ స్టేషన్ల కోర్టు కానిస్టేబుళ్లను అభినందించి ప్రసంశ పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ మురళి కృష్ణ,సిఐ లు కృష్ణ, శ్రీనివాస్, వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, డీసీఆర్బీ సి.ఐ శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ సి.ఐ శ్రీనివాస్,ఆర్ఐ లు మధుకర్, రమేష్ కోర్టు కానిస్టేబుల్ పాల్గొన్నారు.

# నవంబర్ 2వ వారంలో మెగా ఫారిన్ జాబ్ మేళా



● మంత్రి పొన్నం ప్రభాకర్

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధిని విస్తృతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. నవంబర్ రెండవ వారంలో హుస్నాబాద్‌లో మెగా ఫారిన్ జాబ్ మేళా నిర్వహించాలని సూచించారు. అర్హత కలిగిన నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి వారి స్కిల్స్ ఆధారంగా ఉద్యోగాలివ్వాలని తనను కలిసిన కంపెనీ ప్రతినిధులకు చెప్పారు. వివిధ దేశాల వారీగా స్టాల్స్ ఏర్పాటు చేసేలా టాంకాం ప్రతినిధులతో శుక్రవారం మంత్రి పొన్నం ప్రభాకర్ సమావేశం నిర్వహించారు. హుస్నాబాద్ నిరుద్యోగ యువత ఫారిన్ జాబ్ మేళాకు ఎన్‌రోల్మెంట్ చేసుకోవాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి చెందిన దేశాల్లో భారీ వేతనాలతో ఉన్న ఉద్యోగ అవకాశాలు పొందేలా మంత్రి పొన్నం ప్రభాకర్ సచివాలయంలో టాంకాం ప్రతినిధులతో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

హుస్నాబాద్ లో నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి వివిధ రంగాల్లో వారికి ఉన్న స్కిల్స్ ఆధారంగా వివిధ దేశాల్లో మంచి జీతాలతో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా మెగా ఫారిన్ జాబ్ మేళాను ఏర్పాటు- చేయాలని నిర్ణయించారు. నవంబర్ మొదటి వారంలో జరిగే జాబ్ మేళా కోసం మండలాల్లో అవగాహన కల్పించాలని మూడు జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ప్రతి గ్రామంలో ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువత డేటా సేకరించి వారికి ఆసక్తి ఉన్నా విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రోత్సహించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఇప్పటికే హుస్నాబాద్ నియోజకవర్గంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకి మంచి స్పందన వచ్చిందని, దాని ద్వారా 5 వేల మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చాయని తెలిపారు. విదేశాల్లో లక్షల్లో జీతాలు ఉన్న ఉద్యోగాలకు టాంకాం కంపెనీ ద్వారా నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చి వారికి ఉద్యోగ భద్రత కల్పిస్తూ ఇక్కడి నుండి మంచి కంపెనీలకు పంపించడానికి ఉన్న మెరుగైన అవకాశాలను ఉపయోగించుకోవాలని సూచించారు.

## దక్షిణాది రాష్ట్రాలపై
# కేంద్ర ప్రభుత్వం వివక్ష

(మొదటి పేజీ తరువాయి)

ద్వారా కేంద్రానికి రూపాయి వెళ్తే ఏడు రూపాయలు, బీహార్‌కు రూ.6 వెనక్కి వస్తున్నాయని ఉదహరించారు. హైదరాబాద్‌లోని బాపూఘాట్‌ను అంతర్జాతీయ స్థాయిలో గాంధీ ఐడియాలజీ కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈసా, మూసా నదులు కలిసే చోట బాపూ ఘాట్ ఉన్నదనీ, గుజరాత్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహంలా బాపూఘాట్‌లో గాంధీజీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. మూసీ పునరుజ్జీవాన్ని, బాపూ ఘాట్ అభివృద్ధిని బీఆర్ఎస్, బీజేపీ వ్యతిరేకిస్తున్నాయని చెప్పారు. గుజరాత్‌లో సబర్మతి రివర్ ఫ్రంట్ నిర్మించుకున్నారనీ, తాము మూసీ పునరుజ్జీవం చేస్తామంటే ఎందుకు అడ్డుపడుతున్నారని ప్రశ్నించారు. ఫ్యూచర్ సిటీ, రీజనల్ రింగ్ రోడ్డు, రేడియల్ రాడార్, ఇరిగేషన్ ప్రాజెక్టులతో తెలంగాణ పురోగతి సాధించి గుజరాత్‌కు పోటీ ఇస్తుందనే భయం బీజేపీకి ఉందనీ, దానికి బీఆర్ఎస్ వత్తాసు పలుకుతున్నదని అన్నారు. పదేండ్లు ప్రభుత్వాన్ని నడిపిన మాజీ సీఎం కేసీఆర్ పదిసార్లు కూడా సెక్రెటేరియట్‌కు రాలేదనీ, ప్రతిపక్ష హోదా ఇస్తే పది నిమిషాలు అసెంబ్లీలో కూర్చుని వెళ్లిపోయారని విమర్శించారు.

# ఆస్ట్రేలియా సిరీస్‌కు టీమిండియా ఎంపిక

**బలగం టీవీ, హైదరాబాద్**

ఆస్ట్రేలియాతో జరిగే ఐదు మ్యాచ్‌ల బోర్డర్‌గవాస్కర్ సిరీస్ కోసం 18 మందితో కూడిన టీమిండియా జట్టును సెలక్టర్లు ప్రకటించారు. నవంబర్ 22 నుంచి ఈ సిరీస్ జరుగనుంది. రోహిత్ శర్మ కెప్టెన్‌గా, జస్‌ప్రీత్ బుమ్రా వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. అభిమన్యు ఈశ్వరన్, నితీష్ రెడ్డి, హర్షిత్ రాణాలకు జట్టులో చోటు లభించింది. అయితే, చీలమండ గాయం కారణంగా టీమిండియా పేస్ బౌలర్ మహమ్మద్ షమీని తుది జట్టులో ఎంపిక చేయలేదు. అంతేగాక సౌతాఫ్రికాతో జరిగే టి20 సిరీస్‌కు కూడా జట్టును ప్రకటించారు. సూర్యకుమార్ యాదవ్‌ను కెప్టెన్‌గా నియమించారు.

**టెస్టు జట్టు వివరాలు: రోహిత్ శర్మ (కెప్టెన్), బుమ్రా, జైస్వాల్, అభిమన్యు, గిల్, కోహ్లి, రాహుల్, రిషబ్, సర్ఫరాజ్, ధ్రువ్ జురెల్, అశ్విన్, జడేజా, సిరాజ్, ఆకాశ్‌దీప్, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా, నితీష్ కుమార్, వాషింగ్టన్.**

**టీమిండియా టీ20 జట్టు :సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజు శాంసన్ (వికెట్ కీపర్), రింకు సింగ్, తిలక్ వర్మ, జితేష్ శర్మ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, రమణదీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్ సింగ్, విజయ్‌కుమార్ వైషాక్, అవేష్ ఖాన్, యష్ దయాళ్.**

# గ్రూప్ 1 మెయిన్స్‌లో కాపీయింగ్..!

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో జరుగుతున్న గ్రూప్ –1 మెయిన్స్ పరీక్షల్లో ఒక అభ్యర్థిని కాపీయింగ్‌కు పాల్పడగా, ఆమెను టిజిపిఎస్‌సి డీబార్ చేసింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మంగల్‌పల్లిలోని సివిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో గ్రూప్– 1 మెయిన్స్ పరీక్షలో కాపీయింగ్‌కు పాల్పడుతూ మహిళా అభ్యర్థిని అధికారులకు పట్టుబడ్డారు. దీంతో అభ్యర్థి ఆన్సర్ షీట్‌కు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. చీర కొంగులో చిట్టీలు తీసుకొచ్చి మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతుండగా గుర్తించిన ఇన్విజిలేటర్ అధికారులకు సమాచారం అందించారు.ఈ మేరకు అధికారులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన అభ్యర్థిని వెంటనే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా, ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కేసీ వేణుగోపాల్‌తో డిప్యూటీ సీఎం భేటీ



**బలగం టీవీ, హైదరాబాద్**

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శుక్రవారం సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన ప్రక్రియపై వివరణ ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి వచ్చిన సందర్భంగా గతేడాది రాహుల్‌గాంధీ కులగణనపై స్పష్టమైన హామీ ఇచ్చారని, దేశవ్యాప్తంగా చేపట్టే ప్రక్రియలో భాగంగా తెలంగాణ నుంచే మొదట ప్రారంభిస్తామని వివరించారు. గత కొన్ని రోజులుగా కులగణన చేపట్టడానికి అనుసరించాల్సిన విధానంపై స్టేట్ బీసీ కమిషన్ కసరత్తు చేస్తున్నదని, ప్రక్రియ సజావుగా, సంతృప్తికరంగా, ఫలితాలు అందించే విధంగా ఉండేందుకు రాష్ట్ర ప్లానింగ్ డిపార్టుమెంటును నోడల్ ఏజెన్సీగా నియమించి నిర్వహిస్తున్నట్లు కేసీ వేణుగోపాల్‌కు వివరించారు. ఈ ప్రక్రియ ద్వారా రానున్న ఫలితాలు, దానికి అనుగుణంగా ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ పథకాల్లో లబ్ధిదారుల గుర్తింపు సులభతరం కావడం, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ ఫార్ములాను ఫైనల్ చేయడానికి దోహదపడడం... ఇలాంటి అనేక అంశాలను వివరించారు. కులగణన కోసం రూపొందించిన ప్రశ్నావళి, ప్రొఫార్మాను అందజేశారు.

ఈ నెల 28 నుంచి రాష్ట్రవ్యాప్తంగా కులగణన ఎనిమిది వారాల పాటు (60 రోజులు) జరగనున్నదని, డిసెంబరు 9వ తేదీ నాటికి ప్రభుత్వానికి నివేదిక అందనున్నట్లు కేసీ వేణుగోపాల్‌కు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వివరించారు. జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు ఏఐసీసీ సీనియర్ అబ్జర్వర్‌గా పార్టీ హైకమాండ్ నియమించినందున గత వారం జరిపిన పర్యటన వివరాలను కూడా వేణుగోపాల్‌తో పంచుకున్నారు. అక్కడి పరిస్థితులను వివరించి పార్టీపరంగా తీసుకోవాల్సిన చర్యలు, సమన్వయం కోసం రూపొందించాల్సిన మెకానిజం తదితరాలపై కూడా చర్చించినట్లు తెలిసింది. ఇదే విషయమై అజయ్ మాకెన్‌తో కూడా విడిగా భేటీ అయిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అభిప్రాయాలను పంచుకున్నారు. సాయంత్రానికి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. త్వరలో కొన్ని రోజుల పాటు జార్ఖండ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు.

# మెడిస్టార్ వాల్ పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి





**బలగం టీవీ, హైదరాబాద్**

మెడి స్టార్ హాస్పిటల్ తమ 3వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం జారీ చేసిన తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులకు ఓ పి సేవలకు గాను 10 రూపాయల ఫీజును మాత్రమే తీసుకోవాలని రూపొందించిన వాల్ పోస్టర్ ను రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హైదరాబాద్ లోని తన క్యాంపు కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... సామాన్యుడికి మెరుగైన వైద్య సేవలను ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా అందజేస్తున్నామన్నారు. వైద్యం భారం కాకుండా ప్రైవేటు, చారిటీ ఆసుపత్రులలో మెరుగైన వైద్యాన్ని సామాన్యుడికి నామమాత్రపు ఫీజులతో అందించేందుకు ప్రైవేటు యాజమాన్యాలు ముందుకు రావాలన్నారు. మెడిస్టార్ యాజమాన్యం ప్రభుత్వం జారీ చేసిన తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులకు ఓ పి సేవల గాను 10 రూపాయల నామమాత్రపు ఫీజును తీసుకోవడం తమ సేవభావాన్ని మంత్రి కొనియాడారు.

# కలుషిత నీటి విడుదల ఆపకపోతే
## అరబిందో కంపెనీని తగలబెడుతా

**బలగం టీవీ, హైదరాబాద్**



అరబిందో కంపెనీని తగలబెడుతానని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని పోలేపల్లి నుంచి పంటపొలాలకు అరబిందో, హెటిరో, శిల్ప కంపెనీలు కలుషిత నీటిని విడుదల చేస్తున్నాయని స్థానిక రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలుషిత నీటి విడుదల ఆపకపోతే అరబిందో కంపెనీని తగలబెడతానని వార్నింగ్ ఇచ్చారు. వెంటనే కలుషిత నీటి సరఫరా జరుగకుండా చూడాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# బీరు సీసాలో బల్లి అవశేషం...!

**బలగం టీవీ, హైదరాబాద్**



బీరు బాటిల్‌లో గుర్తుతెలియని అవశేషం కన్పించడంతో కొనుగోలుదారులు భయందోళనకు గురయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. వికారాబాద్ జిల్లా ధారూరులోని కేరెల్లికి చెందిన లక్ష్మీకాంత్‌రెడ్డి, అనంతయ్య విందుకోసమని రూ.4వేల విలువైన వివిధ బ్రాండ్‌ల మద్యాన్ని కొనుగోలు చేశారు. స్ట్రాంగ్ బీరు సీసాలో గుర్తుతెలియని అవశేషం కన్పించడంతో అవాక్కయ్యారు. బీరు బాటిల్‌లో ఉన్నది బల్లి అవశేషం అనుకొని భయాందోళనకు గురయ్యారు. బాటిల్‌ను ఓపెన్ చెయ్యకుండా వైన్ షాపునకు వెళ్లి యజమానిని ప్రశ్నించారు. తనకు సంబంధం లేదని షాప్ ఓనర్ దబాయించాడు. దీంతో లక్ష్మీకాంత్‌రెడ్డి బీరు బాటిల్ ఫొటో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయగా అది వైరలైంది. ఇదిలా ఉంటే సదరు వైన్స్‌లో అమ్మింది కంపెనీ బీరేనా? లేక లేబుల్ వేసి నకిలీ బీర్లేమైనా అమ్ముతున్నారా? అని మద్యం కొనుగోలుదారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై మద్యం ప్రియులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటివి జరగకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని, పొరపాట్లు చేసే తయారీదారులు, పంపిణీదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# పట్టుబిగించిన న్యూజిలాండ్..



- భారీ ఆధిక్యం దిశగా..
- ప్రస్తుతం 301 పరుగుల ఆధిక్యంలో
- టీమిండియా 156 పరుగులకే ఆలౌట్

**బలగం టీవీ, పుణె**

పుణె వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో న్యూజిలాండ్ పట్టుబిగించింది టీమిండియా 156 పరుగులకే ఆలౌట్ చేసిన కివీస్ రెండో రోజు ఆట ముగిసేసరికి రెండో ఇన్నింగ్స్‌లో 195-5తో ఉంది. దాంతో మొత్తం 301 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. ఓపెనర్ టామ్ లేథమ్ (86 పరుగులు) హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు ప్రస్తుతం క్రీజులో గ్లెన్ ఫిలిప్ (9 పరుగులు), టామ్ బ్లండెల్ (30 పరుగులు) ఉన్నారు. వాషింగ్టన్ సుందర్ 4, రవిచంద్రన్ అశ్విన్ 1 వికెట్ పడగొట్టారు.

**చేతులెత్తేసిన బ్యాటర్లు**

అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో టీమ్ఇండియా 156 పరుగులకు ఆలౌటైంది. తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో భారత బ్యాటర్లు చేతులెత్తేశారు. బౌలింగ్‌లో అదరగొట్టిన భారత్, బ్యాటింగ్‌లో తడబాటుకు గురైంది. 16-1 ఓవర్‌నైట్ స్కోర్‌తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన టీమ్ఇండియా వరుసగా వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (30 పరుగులు), శుభ్‌మన్ గిల్ (30 పరుగులు), రవీంద్ర జడేజా (38 పరుగులు) ఫర్వాలేదనిపించారు. భారీ అంచనాలతో క్రీజులోకి దిగిన స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (1) తీవ్రంగా నిరాశ పర్చాడు. మిచెల్ శాంట్నర్ 7 వికెట్లతో సత్తా చాటగా, గ్లెన్ ఫిలిప్ 2, టిమ్ సౌథీ 1 వికెట్ దక్కించుకున్నారు.

అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కివీస్ బ్యాటర్ల ఇప్పటికే సగం వికెట్లు కోల్పోయినా 301 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఇక మూడో రోజు కివీస్ ఎక్కువ సమయం బ్యాటింగ్ కొనసాగితే భారత్ ముంగిట భారీ టార్గెట్ ఉంచడం ఖాయంగా కనిపిస్తోంది. అందుకే రెండో ఇన్నింగ్స్‌లో కివీస్‌ను వీలైనంత త్వరగా ఔట్ చేసి, బ్యాటింగ్‌లో రాణిస్తేనే భారత్‌కు మ్యాచ్ నెగ్గే అవకాశం ఉంటుంది.

తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్లతో న్యూజిలాండ్ నడ్డివిరిచిన సుందర్(4/56) రెండో ఇన్నింగ్స్‌లోనూ వికెట్ల వేట కొనసాగించాడు. తొలుత ఓపెనర్ డెవాన్ కాన్వే(17)ను ఎల్బీగా ఔట్ చేసి బ్రేకిచ్చాడు. మరోవైపు అశ్విన్ తన మ్యాజిక్ చూపిస్తూ విల్ యంగ్(23)ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. కివీస్‌ను మరింత ఒత్తిడికి గురి చేస్తూ రచిన్ రవీంద్ర(9)లను , డారిల్ మిచెల్(18)లను సుందర్ డగౌట్ చేర్చాడు. అయితే.. ఓపెనర్ టామ్ లాథమ్ (86) మాత్రం క్రీజులో పాతుకుపోయాడు. మిచెల్ ఔటయ్యాక టామ్ బ్లండెల్(30 నాటౌట్) తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. భారత బౌలర్లను విసిగిస్తూ ఐదో వికెట్‌కు 60 పరుగులు జోడించాడు.ఈ జోడీని సుందర్ విడదీశాడు. సెంచరీ దిశగా దూసుకెళ్తున్న డేంజరస్ లాథమ్‌ను ఎల్బీగా వెనక్కి పంపాడు. ఆ క్షణం.. హమ్మయ్యా.. అని ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం గ్లెన్ ఫిలిప్స్(9 నాటౌట్).. ఆడారు. రెండో రోజు ఆట ముగిసే సరికి న్యూజిలాండ్ 5 వికెట్ల నష్టానికి 198 పరుగులు చేసి.. ఆధిక్యాన్ని 301కి పెంచుకుంది.



# రిటెన్షన్ షో ప్రత్యక్ష ప్రసారం

- అక్టోబర్ 31న జియో సినిమాలో



**బలగం టీవీ, ముంబై**

2025 ఐపీఎల్ రిటైన్షన్స్?కు గడువుకు సమయం దగ్గర పడుతోంది. అక్టోబర్ 31 సాయంత్రం 5.00 వరకు అన్ని ఫ్రాంచైజీలు వాళ్లు అట్టిపెట్టుకునే ప్లేయర్ల లిస్ట్‌ను అందించాల్సి ఉంది. ఈ నేపథ్యంలోఈ రిటెన్షన్స్ కూడా లైవ్‌లో ప్రసారం కానున్నాయి. 'రిటెన్షన్ షో' పేరిట ఐపీఎల్ నిర్వాహకులు స్పెషల్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేస్తున్నారు. అన్ని జట్లు రిటైన్ చేసుకునే ఆటగాళ్ల లిస్ట్‌ను లైవ్‌లో చూసి ఎంజాయ్ చేయవచ్చు. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ జియో సినిమాలో అక్టోబర్ 31 సాయంత్రం 4.30 గంటలకు ఈ రిటెన్షన్ షో ప్రారంభం కానుంది. అలాగే స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఛానెళ్లలో బ్రాడ్‌కాస్టింగ్ కూడా జరగనుంది. దీంతో క్రికెట్ ఫ్యాన్స్ ఎంతో ఆత్రుతగా ఈ ప్రోగ్రామ్ కోసం ఎదురుచూస్తున్నారు. కాగా, 2025 మెగా వేలం నవంబర్ ఆఖరి లేదా డిసెంబర్ తొలి వారంలో జరగనున్నట్లు తెలుస్తోంది



## జైలు నుంచి విడుదలైన జానీ మాస్టర్

**బలగం టీవీ, హైదరాబాద్**

లైంగిక వేధింపుల కేసులో అరెస్ట్ అయిన ప్రముఖ టాలీవుడ్ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ నేడు చంచల్‌గూడ జైలు నుంచి విడుదల అయ్యాడు. జానీ మాస్టర్‌కు బెయిల్ మంజూరు కావడంతో శుక్రవారం విడుదల చేశారు. లేడి డ్యాన్సర్‌ను లైంగికంగా వేధించాడంటూ ఆరోపణల నేపథ్యంలో సెప్టెంబర్ 20న అరెస్ట్ అయ్యాడు జానీ మాస్టర్. గత 36 రోజులుగా జైలు జీవితం గడిపిన జానీకి రంగారెడ్డి కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో నేడు విడుదల అయ్యాడు.



## ఏఎన్ఆర్ అవార్డుల కార్యక్రమానికి చిరంజీవికి నాగార్జున ఆహ్వానం

**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవిని కింగ్ నాగార్జున కలిశారు. త్వరలో జరుగనున్న ఏఎన్ఆర్ నేషనల్ అవార్డుల కార్యక్రమానికి ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ ఏడాది ఏఎన్ఆర్ నేషనల్ అవార్డును చిరంజీవికి ఇవ్వాలని నిర్ణయించినట్లు నాగార్జున ప్రకటించిన విషయం తెలిసిందే. అక్టోబరు 28న ఈ అవార్డును చిరంజీవికి ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా చిరంజీవిని కలుసుకుని ఇన్విటేషన్ అందించారు నాగార్జున. ఈ విషయాన్ని సోషల్ మీడియాలో తెలుపుతూ.. ఈ ఏడాది నాకెంతో స్పెషల్. నాన్నగారి 100వ జయంతి వేడుకలకు చిరంజీవి, అమితాబ్ బచ్చన్ రానున్నారు. దీంతో ఈ వేడుక మరింత ప్రత్యేకం కానుంది. ఈ శతజయంతి వేడుకను మరుపురానిదిగా చేద్దాం అంటూ నాగార్జున రాసుకోచ్చాడు. దీంతో పాటు ఒక ఫొటో కూడా విడుదల చేశాడు.

## 'క' ట్రైలర్ విడుదల


**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన తొలి పాన్ ఇండియా మూవీ 'క'. తన్వీ రామ్ హీరోయిన్‌గా నటించింది. ఈ చిత్రానికి సుజిత్, సందీప్ సంయుక్తంగా దర్శకత్వం వహించారు. దీపావళి కానుకగా అక్టోబర్ 31న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ దగ్గర పడడంతో చిత్ర బృందం తాజాగా 'క' ట్రైలర్‌ను విడుదల చేసింది. ఇది ఆద్యంతం ఆకట్టుకునేలా సాగింది. 2 నిమిషాల 45 సెకన్ల నిడివి గల ఈ 'క' ట్రైలర్ మొదట యాక్షన్ సన్నివేశంతో మొదలైంది. పోస్ట్ మ్యాన్‌గా జాయిన్ అవుతాడు అభినయ వాసుదేవ్ (కిరణ్ అబ్బవరం).అయితే ఉత్తరాలు పంచే క్రమంలో 1979 ఏప్రిల్ 22న అభిషేక్ పేరుతో వచ్చిన ఓ ఉత్తరం వాసుదేవ్ జీవితాన్ని మలుపు తిప్పుతుంది. అసలు ఆ ఉత్తరంలో ఏముంది? అని చెప్పమంటూ ఓ ముసుగు వ్యక్తి వాసుదేవ్‌ను బెదిరించడం, ఆ తర్వాత వాసుదేవ్‌ను ఆ ముసుగు వ్యక్తి, అతడి గ్యాంగ్ వెంటాడం? ఈ క్రమంలోనే వాసుదేవ్? వెనుదిరిగి వారిని చంపడం ఆసక్తిని కలిగించాయి. మరి ఇంతకీ ఆ ఉత్తరంలో ఏముందో తెలియాలంటే సినిమా విడుదల వరకు వేచి ఉండాల్సిందే.



## ఆసక్తికర పోస్ట్ షేర్ చేసిన లోకేశ్ కనగరాజ్

**బలగం టీవీ, హైదరాబాద్**




కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ ప్రస్తుతం సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా 'కూలీ' సినిమా తెరకెక్కిస్తున్నారు. ఇంతకుముందు ఆయన తన సినిమాటిక్ యూనివర్స్‌తో భారతీయ సినీ ప్రేక్షకులకు కొత్త అనుభూతి పంచారు. అయితే దానికిపై క్లారిటీ ఇవ్వకముందే దర్శకుడు లోకేశ్, ఎల్‌సీయూకి సంబంధించి ఓ ఆసక్తికర అప్డేట్ ఇచ్చారు. సినిమాటిక్ యూనివర్స్ ఎలా? ఎక్కడ మొదలైంది? అనే విశేషాలతో కూడిన ఓ ప్రీల్యూడ్ వీడియోను తీసుకురానున్నట్టు తన అఫీషియల్ ట్విట్టర్ ద్వారా ప్రకటించారు. 10 నిమిషాల నిడివితో ఆ వీడియో రానుంది. 'ఛాప్టర్ జీరో' హ్యాష్‌ట్యాగ్‌తో ఓ పోస్టర్ రిలీజ్ చేశారు. '1 షాట్ 2 కథలు 24 గంటలు' అని పోస్టర్‌లో రాసి ఉంది. గన్స్, బుల్లెట్స్‌తో కనిపిస్తున్న ఈ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'లోకేశ్ నుంచి భారీ స్థాయిలో ఇంకేదో రాబోతోంది' అంటూ ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు.

# 21వ అఖిల భారత పశు గణన పోస్టర్ ఆవిష్కరణ..





- 25 అక్టోబర్ 2024 నుండి 28 ఫిబ్రవరి 2025 వరకు నిర్వహణ
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల :**

21 వ అఖిల భారత పశు గణన – తెలంగాణ కార్యక్రమం లో భాగంగా శుక్రవారం రాజన్న సిరిసిల్ల కలెక్టరేట్ లో 21 వ అఖిల భారత పశు గణన – తెలంగాణ గోడ పత్రిక ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆవిష్కరించారు.21వ అఖిల భారత పశు గణన 25 అక్టోబర్ 2024 నుండి 28 ఫిబ్రవరి 2025 వరకు నిర్వహించబడుతుందనీ, పశు గణన డిజిటల్ ప్లాట్‌ఫారమ్ (భారత్ పశుదాన్ పోర్టల్ )లో పశు గణన జరుగుతుందనీ అధికారులు వివరించారు. ఎన్యూమరేటర్ల పనిని మండల స్థాయిలో సూపర్‌వైజర్లు పర్యవేక్షిస్తారని , దీని కోసం ఆ మండలానికి చెందిన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌లకు బాధ్యతలు అప్పగిస్తున్నమన్నారు . జిల్లా స్థాయిలో జిల్లా నోడెల్ అధికారి పర్యవేక్షిస్తారన్నారు.

పశు గణన ద్వారా పశువులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు మరియు మరిన్నింటితో సహా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పశువులు, కోళ్ల సంఖ్యను గణన లెక్కిస్తుందన్నారు.ఇది పశువుల వయస్సు, లింగం మరియు జాతికి సంబంధించిన డేటాను కూడా సేకరిస్తుందన్నారు . ఈ కార్యక్రమలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రవీందర్ రెడ్డి , ఈ.డి.ఎస్సి కార్పొరేషన్ స్వప్న , పశు వైద్య అధికారులు పాల్గొన్నారు .



# నిరుపేదల ఆపన్న హస్తం సీఎంఆర్ఎఫ్

- కాంగ్రెస్ మండల అధ్యక్షులు జలగం ప్రవీణ్

**బలగం టీవీ, తంగళ్ళపల్లి :**

పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించడానికి సీఎంఆర్ఎఫ్ ఎంతో సహాయ పడుతుందని తంగళ్ళపల్లి మండలంలోని తాడూరు, దేశాయ్ పల్లె, అంకిరెడ్డిపల్లె గ్రామాల్లో గ్రామశాఖ అధ్యక్షుల ఆధ్వర్యంలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసిన కాంగ్రెస్ నాయకులు.గత బీఆర్ఎస్ ప్రభుత్వంలా ప్రజలను మభ్యపెట్టి పరిపాలన సాగించకుండా ప్రజల శ్రేయస్సు కోసం పరిపాలన సాగిస్తోన్న నేత సీఎం రేవంత్ రెడ్డి అని కాంగ్రెస్ మండల అధ్యక్షులు జలగం ప్రవీణ్ అన్నారు.సీఎం రేవంత్ రెడ్డి,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జీ కేకే మహేందర్ రెడ్డి మండల అధ్యక్షులు జలగం ప్రవీణ్ కి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

# వరి ధాన్య కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఫ్యాక్స్



**బలగం టీవీ,తంగళ్ళపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం చీర్లవంచ గ్రామంలో సిరిసిల్ల ఫ్యాక్స్ ఆధ్వర్యంలో వరి ధాన్య కొనుగోలు కేంద్రాన్ని ఫ్యాక్స్ చైర్మన్ బండి దేవదాస్ గౌడ్,ఏఎంసీ చైర్మన్ వెముల స్వరూప తిరుపతిరెడ్డి లు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళారుల బారిన పడకుండా కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు దర పొందాలని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఫ్యాక్స్ వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి,ఫ్యాక్స్ డైరెక్టర్స్ ఉమ్మారెడ్డి సత్యనారాయణ రెడ్డి,గడీల సురేష్,బండి దేవేందర్ యాదవ్,ఏ ఎంసి డైరెక్టర్స్, దుబాల వెంకటేశం,గంగు కొండయ్య,నక్క నర్సయ్య, కాజా,స్థానిక మాజీ సర్పంచ్ జక్కుల రవీందర్,నాయకులు కొండల్ రావు,కమలాకర్ రావు, రైతులు,హమాలీలు పాల్గొన్నారు.

# 19 వీడీఏల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ

**బలగం టీవీ ,హైదరాబాద్**

రాష్ట్రంలో పట్టణ ప్రాంతాలు, సమీప గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, ఆదాయ వనరుల సమీకరణే లక్ష్యంగా హెచ్ఎండీఏ తరహాలో 19 అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ (వీడీఏ)లను ఏర్పాటు చేస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిషోర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా జిల్లా కేంద్రాలతో పాటు సమీపంలోని గ్రామాల్లో రోడ్ల నెట్‌వర్క్ అభివ్రద్ధి, తాగునీటి సరఫరా, ఉపాధి కల్పన, శాటిలైట్ టౌన్‌షిప్‌ల అభివృద్ధి చేయాలనే లక్ష్యంగా ఈ ఆథారిటీలను ఏర్పాటు చేసినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో వేములవాడ మున్సిపాలిటీతోపాటు 152 గ్రామాలను కలిపి వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ ఆథారిటీ ఏర్పాటు చేశారు. కరీంనగర్ జిల్లాలో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు 3 మున్సిపాలిటీలు, 147 గ్రామాలతో శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీని ఏర్పాటు చేశారు.సూర్యపేట జిల్లా కేంద్రంగా సూర్యపేట మున్సిపాలిటీతో పాటు ఐదు మున్సిపాలిటీలు, 264 గ్రామాలను కలిపి అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ, సిద్దిపేట్ జిల్లాలో సిద్ది పేట్ మున్సిపాలిటీతో పాటు 4 మున్సిపాలిటీలు, 286 గ్రామాలతో సిద్దిపేట్ అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీని ఏర్పాటు చేశారు. ఖమ్మం జిల్లాలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు రెండు మున్సిపాలిటీలు, 279 గ్రామాలతో స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీని ఏర్పాటు చేశారు. వనపర్తి జిల్లా అభివ్రద్ధిలో భాగంగానే వనపర్తి టౌన్, ఐదు మున్సిపాలిటీలు, 215 గ్రామాలను కలుపుకుని వనపర్తి అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ ఏర్పాటు చేశారు. వికారాబాద్ జిల్లాలో వికారాబాద్ మున్సిపాలిటీతో పాటు 4 మున్సిపాలిటీలు, 492 గ్రామాలతో వికారాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ, సంగారెడ్డి జిల్లాలో సంగారెడ్డి మున్సిపాలిటీతో పాటు 5 మున్సిపాలిటీలు సంగారెడ్డి అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ, 5 మున్సిపాలిటీలు, 466 గ్రామాలు, నిజామాబాద్ జిల్లాలో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు 3 మున్సిపాలిటీలు, 380 గ్రామాలతో నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ, నిర్మల్ జిల్లాలో నిర్మల్ మున్సిపాలిటీతోపాటు మూడు మున్సిపాలిటీలు, 420 గ్రామాలతో నిర్మల్ అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ, మహబూబబాద్ జిల్లాలో టౌన్‌తో పాటు 4 మున్సిపాలిటీలు, 159 గ్రామాలతోపాటు మహబుబబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీని ఏర్పాటు చేశారు.



# హమాలి కార్మికులకు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలి

## జిల్లా సీఐటీయూ డిమాండ్

**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం తడగొండ గ్రామంలో హమాలీ కార్మికుల ఆధ్వర్యంలో పత్రిక సమావేశం సందర్భంగా గత కొన్ని సంవత్సరాల నుండి హమాలి కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, అలాగే 50 సంవత్సరాలు పైబడిన కార్మికులకు 5000 రూపాయలు పెన్షన్ అందించాలని జిల్లా సిఐటియు కమిటీ సభ్యులు గురిజల శ్రీధర్ అన్నారు.

ఈ సందర్భంగా గురిజల శ్రీధర్ హమాలి కార్మికులకు ఆరోగ్య భద్రత హెల్త్ కార్డులను అందించాలని, హమాలి కార్మికుల పిల్లలకు ప్రత్యేకంగా చూసి వారికి స్కాలర్షిప్ లు అందించాలని అన్నారు.అలాగే ఇల్లు లేని పేదలు చాలామంది హమాలి కార్మికులలో ఉన్న సందర్భంలో వారిని గుర్తించి, డబుల్ బెడ్ రూమ్ కట్టించాలని, వారికి ఏదైనా సంఘటన జరిగినప్పుడు 5 లక్షలకు మించకుండా ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని తదితర డిమాండ్లు నెరవేర్చాలని, గత ప్రభుత్వంలో కార్మికుల పక్షాన ఎన్నో పోరాటాలు చేసినప్పటికీ, ఆ ప్రభుత్వం పూర్తిగా కార్మికుల విషయంలో విఫలమైందని, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అయినా కార్మికుల బతుకులు మారుస్తదని చెప్పి కోటి ఆశలతో ఎదురుచూసినా కూడా నిరాశ, నిస్పృహ ఎదురవుతుందని, మరి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి దాదాపు పది నెలల అవుతున్నా కూడా ఈ ప్రభుత్వం హమాలి కార్మికుల విషయంలో మెతక వైఖరి ఆవలంబిస్తున్న సందర్భంలో ఇప్పటికైనా ఈ ప్రభుత్వం హమాలి కార్మికులను గుర్తించి వారి డిమాండ్ల సాధనకై చర్యలు తీసుకొని నెరవేర్చాలని ఈ సందర్భంగా జిల్లా సిఐటియు పక్షాన ఈ ప్రభుత్వానికి డిమాండ్ చేయడం జరుగుతుంది.

ఈ కార్యక్రమంలో జిల్లా సిఐటియు కమిటీ సభ్యులు గురిజల శ్రీధర్, తడగొండ గ్రామ హమాలి సంఘం అధ్యక్షులు, కోరే మల్లయ్య, కార్మికులు రవీందర్, సిహెచ్ రాజశేఖర్, సిహెచ్ పరశు రాములు, గజ్జె పీరయ్య, తోట మహేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.